సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 12 । ఆగస్టు । 2023



పులస వేటలో..

గోదావరిలో పులస వేట ముమ్మరంగా సాగుతోంది. సిద్ధాంతం నుంచి నరసాపురం వరకు నదిలో పులసలు పట్టడం కోసం మత్స్యకారులు శ్రమిస్తున్నారు. 10లో ▸



శవమై తేలిన చిన్నారి

మీనవిల్లూరులో రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయిన బాలుడు బోకల వెంకట కల్యాణ్ యనమదుర్రు డ్రెయిన్‌లో కోమర్రు వద్ద శవమై తేలాడు. 10లో ▸

త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు త్వరలో 4జీ సేవలు అందించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు.

10లో

ఓటర్ల సర్వే పారదర్శకం

స్వచ్ఛంగా.. సమగ్రంగా..

- ముమ్మరంగా ఇంటింటా పరిశీలన
- దొంగ ఓట్ల పేరుతో టీడీపీ, జనసేన అసత్య ప్రచారం
- అపార్ట్‌మెంట్లలో ఓట్లపై గందరగోళం
- తాత్కాలిక ఇంటి నంబర్ల ఏర్పాటు



భీమవరం మండలం కొమరాడలో ఓటర్ల సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రవికుమార్

జిల్లాలో ఓటర్లు	
14,42,471	
పురుషులు	ఇతరులు
7,07,411	101
మహిళలు	పోలింగ్ కేంద్రాలు
7,34,959	1,454

సాక్షి,భీమవరం: జిల్లాలో ఓటర్ల సర్వే పారదర్శకంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ దొంగ ఓట్లు నమోదు చేయిస్తోందంటూ తెలుగుదేశం, జనసేన పార్టీలు చేస్తున్న ప్రచారం అసత్యమని తేలిపోయింది. ఒకే ఇంటి నంబర్‌లో వందల సంఖ్యలో ఓట్లు ఉన్నాయంటూ గగ్గోలు పెడుతుండగా అదంతా గోబెల్స్ ప్రచారమని స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా ఓటర్ల సర్వే కార్యక్రమం గత నెల 21న ప్రారంభమైంది. దీనిలో భాగంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) ఇంటింటా తిరుగుతూ ఓటర్ల సర్వే చేస్తున్నారు. సర్వే ఈనెల 20తో పూర్తి కావాల్సి ఉండగా ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

7 నియోజకవర్గాలు.. 19 మండలాలు

జిల్లాలోని భీమవరం, ఉండి, పాలకొల్లు, నరసాపురం, ఆచంట, తణుకు, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 19 మండలాల్లో మొత్తం 14,42,471 ఓటర్లకుగాను 7,07,411 మంది పురుషులు, 7,34,959 మంది మహిళలు, 101 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు. వీరికి 1,454 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేస్తున్నారు. గత పదిరోజులుగా నిర్వహించిన సర్వేలో ఎక్కడా దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తించిన దాఖలాలు లేవు. అయితే ప్రధానంగా పట్టణాల్లో ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు ఉండటంతో వాటిని దొంగ ఓట్లుగా ప్రతిపక్ష పార్టీలు చిత్రీకరిస్తూ ఆ ఓట్లన్నీ వైఎస్సార్‌సీపీ నాయకులు చేర్పించేవేనని ప్రచారం చేస్తున్నారు. అయితే అధికారులు పరిశీలనలో పట్టణాలు, గ్రామాల్లోని అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు అన్నింటికీ ఒకే ఇంటి నంబర్ ఇవ్వడమే ఇందుకు కారణమని తెలిసింది. ఒక అపార్ట్‌మెంట్‌లో సాధారణంగా 40 ఫ్లాట్ల వరకు ఉండగా వాటిలో సుమారు 180 వరకు ఓట్లు ఉన్నాయి. అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్స్ అన్నింటికీ ఒకే డోర్ నంబర్ ఇవ్వడంతో.. ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు నమోదయ్యాయి. వీటిని దొంగ ఓట్లుగా ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయి. జిల్లాలో కొన్నిచోట్ల మరణించిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లు మినహా దొంగ ఓట్లు ఉన్నట్టు అధికారులు ఎక్కడా గుర్తించలేదు.

అపార్ట్‌మెంట్లలో తాత్కాలిక నంబర్లు

అపార్ట్‌మెంట్లలో ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు ఉండటం, అది కాస్తా గందరగోళంగా మారడంతో ఓటర్ల జాబితా తయారీ కోసం ప్రస్తుతం ఫ్లాట్లకు తాత్కాలిక నంబర్లతో ఓట్లు నమోదు చేస్తున్నారు.

పర్యవేక్షణ అవకాశం దక్కని జనసేన

గ్రామాలు, పట్టణాల్లో ఓటర్ల సర్వేను చేపట్టిన బీఎల్ఓలతోపాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అయితే జనసేన పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు లభించకపోవడంతో ఓటర్ల సర్వేలో జనసేన ఏజెంట్లకు అవకాశం లేకుండా పోయింది.

ముమ్మరంగా ఓటర్ల సర్వే



జిల్లాలో ఓటర్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటివరకు ఎక్కడా దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తించలేదు. అయితే కొన్నిచోట్ల ఒకే ఇంటి నంబర్‌తో 100కు పైగా ఓట్లు ఉన్నట్లు గుర్తించడంతో వాటిపై ఆరా తీశాం. అక్కడ అనేక ఇళ్లకు ఒకే ఇంటి నంబర్ ఉన్నట్టు తెలిసింది. దీంతో ఓటర్ల జాబితా తయారీ కోసం ఆయా ఇళ్లకు తాత్కాలిక ఇంటి నంబర్ ఇచ్చి ఓట్లు నమోదు చేయాలని బీఎల్వోలను ఆదేశించాం.

– దాసి రాజు, ఆర్డీఓ, భీమవరం

సంస్కృతి నిలయాలు పురావస్తు శాలలు



పురావస్తు ప్రదర్శన శాలను పరిశీలిస్తున్న వాణీమోహన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు పురావస్తు ప్రదర్శన శాలలు అని, చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు ఇవి దోహదపడతాయని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జి.వాణీమోహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని అగ్రహారంలో ఉన్న పురావస్తు శాఖ జిల్లా మ్యూజియాన్ని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపురూపమైన ప్రాచీన శిల్పాలు, కళాఖండాలు చారిత్రక వారసత్వ సంపదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో ప్రాచీన కళా రూపాలను, శిల్పాలు, ఇతర కళాఖండాలను మ్యూజియంలో భద్రపరచిన తీరును ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె బుద్ధ పార్కును పరిశీలించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, తహసీల్దార్ సోమశేఖర్ ఆమె వెంట ఉన్నారు.

న్యూస్‌రీల్

బయోమెడికల్ వ్యర్థాలు ప్రమాదకరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: బయోమెడికల్ వ్యర్థాలు ప్రమాదకరమని, వీటి నిర్వీర్యంపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం భీమవరం విష్ణు కళాశాల ఆడిటోరియంలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సుస్థిర అభివృద్ధి సూచికల జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం, వర్క్‌షాప్‌నకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రమాదకరమైన వ్యర్థాలను సరైన విధానంలో నిర్వీర్యం చేయడం ముఖ్యమన్నారు. పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, వ్యవసాయ, మెడికల్ తదితర వ్యర్థాలు నీరు, నేల, గాలిని కలుషితం చేస్తాయన్నారు. ముందుగా బయో మెడికల్ వ్యర్థాలపై అవగాహన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ప్రశాంతి ఆవిష్కరించారు. ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్, సీపీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి వి.ఆదిశేషు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మూడు సర్పంచ్, 28 వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని 28 వార్డులకు గాను 9 వార్డులు ఏకగ్రీవం కాగా 19 వార్డులకు సంబంధించి 71 మంది పోటీలో నిలిచారన్నారు. గొల్లలకోడేరు పంచాయతీలో ఒక వార్డుకు సంబంధించి అత్యధికంగా 10 మంది పోటీలో ఉన్నారన్నారు. మూడు సర్పంచ్ పదవులకు ఎనిమిది మంది నామినేషన్లు వేసి పోటీలో నిలిచారన్నారు. ఇరగవరం మండలం కావలిపురం, పాలకొల్లు మండలం అగర్తపాలెం, యలమంచిలి మండలం బూరుగుపల్లి గ్రామాల్లో సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

త్వరితగతిన టిడ్కో రుణాల మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): బ్యాంకర్లు టిడ్కో లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో టిడ్కో రుణాల మంజూరుపై బ్యాంకర్లు, అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు త్వరలో గృహాలను అందజేసేందుకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసి సహకరించాలని కోరారు. పెండింగ్ ఉన్న దరఖాస్తుల్లో వివిధ కారణాలతో మంజూరు కాని వాటిని గుర్తించి, వారి స్థానంలో అర్హులైన వారికి మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఎటువంటి జాప్యం లేకుండా టిడ్కో రుణాలు వేగవంతం చేయాలని బ్యాంకర్లని కోరారు. సరిగా రుణాలు మంజూరు చేయకుంటే ఆయా బ్యాంకుల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపల్ మున్సిపల్ కమిషనర్లు, బ్యాంక్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సున్నా వడ్డీతో మహిళాభ్యున్నతి

37,187 సంఘాలకు రూ.53.71 కోట్ల విడుదల



సీఎం జగన్ సభను వర్చువల్‌గా వీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ సున్నా వడ్డీతో మహిళలు వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకుని జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురం బహిరంగ సభలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా మహిళా సాధికారత మరింత మెరుగుపడి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందన్నారు. పేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి కుటుంబాలు ఆనందంగా ఉండాలని, సమాజంలో గౌరవంగా ఆర్థికంగా నిలబడాలని ఉద్దేశంతో సీఎం జగన్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. జిల్లాలో నాలుగో విడత సున్నా వడ్డీ కింద నియోజకవర్గాల వారీగా ఆచంటలో 4,317 సంఘాలకు రూ.6.05 కోట్లు, భీమవరంలో 4,873 సంఘాలకు రూ.6.99 కోట్లు, నరసాపురంలో 4,491 సంఘాలకు రూ.6.90 కోట్లు, పాలకొల్లులో 5,801 సంఘాలకు రూ.7.78 కోట్లు, తాడేపల్లిగూడెంలో 4,844 సంఘాలకు రూ.7.34 కోట్లు, తణుకులో 5,739 సంఘాలకు రూ.8.53 కోట్లు, ఉండిలో 5,881 సంఘాలకు రూ.8.36 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం మండలంలో 1,241 సంఘాలకు రూ.1.76 కోట్లు మొత్తంగా 37,187 సంఘాలకు రూ.53.71 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఏపీఎంలు కె.శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, సీఎంఎం సీహెచ్ నాని బాబు, మహిళా సంఘం ప్రెసిడెంట్ పి.అరుణకుమారి, వైస్ ప్రెసిడెంట్ డి.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రతో ఉపాధి



వాండ్రంలో అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: జిల్లాలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ల ఏర్పాటుకు రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత ముందుకు రావాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం వాండ్రం గ్రామ శివారును ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంలో జనరల్ అభ్యర్థులకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా అభ్యర్థులకు 60 శాతం సబ్సిడీపై ప్రభుత్వం రుణాలు అందిస్తుందన్నారు. ఈ అవుట్‌లెట్లలో 24 గంటల పాటు పలురకాల చేపలు, ఆక్వా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని అవుట్‌లెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ కృషిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో నిరుద్యోగులు ఉపాధి బాట పడుతున్నారన్నారు. మత్స్యకార ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఫిష్ ఆంధ్ర పథకం దోహదపడుతుందన్నారు. జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ఎఫ్‌డీఓ వివేక్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం

వసుధకు వందనం చేస్తూ విస్తారంగా మొక్కలు నాటే బాధ్యత చేపడదామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. వాండ్రం పంచాయతీ వద్ద నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలు నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వసుధకు వందనం పేరిట పంచాయతీలు, పాఠశాలలు, కళాశాలు, పరిశ్రమలు తదితర ఆవరణల్లో గ్రామంలో కనీసం 75 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

త్వరలోనే ఏలూరు వైద్య కళాశాల సిద్ధం

- 90 శాతం పనులు పూర్తి
- ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరులో వైద్య కళాశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు, హాస్టల్ నిర్మాణం, మౌలిక వసతులను ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఏలూరు జీజీహెచ్ ఆవరణలోని వైద్య విద్యార్థులకు హాస్టళ్ల ఏర్పాటుపై ఆరా తీశారు. పాత బస్టాండ్ డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మెడికల్ కాలేజీ, హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో తరగతి గదులు, ల్యాబ్స్, ఆధునిక వసతులతో కూడిన ప్రొఫెసర్ల గదులు, కిచెన్, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, విద్యుదీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యాయని, చిన్నపాటి పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మెడికల్ కళాశాలలో తొలి ఏడాది 150 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేలా భవన నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ డి.బలరామిరెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయకుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆశ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డీఐఓ డాక్టర్ నాగేశ్వరరావు ఉన్నారు.

128 అధ్యాపక పోస్టుల మంజూరు

భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్: 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కొత్తగా 128 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదలవుతుందని వైస్ చాన్సలర్ ఆచార్య పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో విద్యా బోధనకు 162 మంది అధ్యాపకులు అవసరం కాగా ప్రస్తుతం 25 మంది మాత్రమే ఉన్నారన్నారు. వర్సిటీలో నూతన విద్యా విధానం అమలు చేస్తూ, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వర్సిటీలో కాలేజీ డెవలప్‌మెంట్ సెల్, పరీక్షల నిర్వహణలో ఆటోమేషన్ విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాలేజీల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని, అనుబంధ కళా శాలలను ప్రతి మూడు నెలలకోసారి వర్చువల్‌గా పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు.

రూ.25.5 కోట్లతో హాస్టల్ భవనాలు : వర్సిటీ క్యాంపస్‌లో ప్రస్తుతం రెండు బాలుర, బాలికల హాస్టళ్లు ఉన్నాయని, వీటికి అదనంగా రూ.25.5 కోట్లతో మరో రెండు హాస్టళ్లు నిర్మిస్తున్నామని ఆచార్య పద్మరాజు తెలిపారు. రూ.16.5 కోట్లతో బాలికలకు, రూ.9 కోట్లతో బాలురకు అదనపు హాస్టళ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. వీటితో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో కూడా అవసమైన భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు.

16, 17 తేదీల్లో సహస్రాబ్ది ఉత్సవాలు

వెయ్యేళ్ల చరిత్ర కలిగిన నగరాల్లో రాజమహేంద్రవరం ఒకటని, ఈ సందర్భంగా ఆదికవి నన్నయ, రాజరాజనరేంద్రుడి పేరిట ఈనెల 16, 17 తేదీల్లో కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో సహస్రాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆచార్య పద్మరాజు తెలిపారు.

పౌల్ట్రీ, ఆక్వా మందుల మాయాజాలం

- అనధికారికంగా గోదాముల నిర్వహణ
- ఏటా రూ.వందల కోట్ల వ్యాపారం



అనధికార గోదాముల్లో పౌల్ట్రీ మందులను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

తణుకు: నిన్నమొన్నటి వరకు మనుషులు వినియోగించే మందుల అమ్మకాల్లో వెలుగు చూసిన అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించాయి. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వినియోగించాల్సిన అబార్షన్ కిట్లు, వయాగ్రా, నిద్రమాత్రలు విచ్చలవిడిగా మార్కెట్‌లో దొరుకుతున్న వైనంపై దృష్టి సారించిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మూలాలను కదిలించారు. తాజాగా పౌల్ట్రీ మందుల అమ్మకాల్లో జరుగుతున్న వ్యవహారంపై దృష్టి సారించిన అధికారులు తణుకులోని శ్రీనివాస పౌల్ట్రీ మెడికల్స్ సంస్థపై దాడి చేసి అవకతవకలు గుర్తించారు. గతంలో ఆక్వాలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న యాంటీ బయోటిక్స్‌పై దృష్టి సారించిన అధికారులు తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలికి తీశారు. గత మార్చిలో తణుకులోని ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ దుకాణంలో చేసిన తనిఖీల్లో నిషేధిత యాంటీబయోటిక్స్ మందులు గుర్తించారు. ప్రస్తుతం పౌల్ట్రీ మందులను సైతం అక్రమంగా గోదాముల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అధికారులు మాత్రం తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి కేవలం రెండు, మూడు గంటల్లోనే తనిఖీలు పూర్తి చేయడం విశేషం.

ఏటా రూ. వందల కోట్ల వ్యాపారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆక్వా సాగు విస్తరిస్తోంది. ఇటీవల చేపలు, రొయ్యల సాగుపై పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా ఏడాదికి దాదాపు రూ.100 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఆక్వా రైతుల ఆశలను సొమ్ములు చేసుకునేందుకు వ్యాపారులు నిషేధిత యాంటీబయోటిక్స్ మందుల్ని ముడి పౌడర్ రూపంలో దిగుమతి చేసుకుని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ఫార్మా కంపెనీలకు తరలించాల్సిన మందులను తయారీ కంపెనీల నుంచి పౌడర్ రూపంలో నేరుగా అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నారు. మరోవైపు జంతువులు, పశువులు, కోళ్లకు వచ్చే వ్యాధులకు వినియోగించాల్సిన యాంటీబయోటిక్స్, పౌల్ట్రీ మందులను చేపలు, రొయ్యల సాగులో వినియోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆక్వా సాగు ఎక్కువగా ఉన్న భీమవరం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు, గణపవరం, అత్తిలి, కానూరు, కైకలూరు, ఏలూరు ప్రాంతాల్లో ఫీడ్స్ అండ్ నీడ్స్ ఏజెన్సీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే ఏజెన్సీలతోపాటు రిటైల్ దుకాణాలకు డ్రగ్ లైసెన్సులు తప్పనిసరి అయినా కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కనీసం ఎలాంటి లైసెన్సులు లేకుండా ఆక్వా, పౌల్ట్రీ మందులను విక్రయిస్తుండగా అక్రమాలపై దృష్టి సారించాల్సిన ఎంపెడా (మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కేవలం ఔషధాల విక్రయాలకే కాకుండా ఆక్వా, పౌల్ట్రీ మందులు విక్రయించే ఏజెన్సీలు, దుకాణాలు సైతం కచ్చితంగా నిబంధనలు పాటించాలి. లైసెన్సులు లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు తేలితే చర్యలు తప్పవు. హోల్‌సేల్ లైసెన్సుతో రిటైల్‌గా విక్రయాలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలతో ఇటీవల తణుకులో తనిఖీలు నిర్వహించాం. పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

–సీహెచ్ హరిప్రసాద్, ఏడీ, ఔషధ నియంత్రణ శాఖ, ఏలూరు

సబ్ కలెక్టర్ సూర్యతేజకు ఆత్మీయ వీడ్కోలు

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ కలెక్టర్, సబ్ డివిజినల్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఐటీడీఏ కేఆర్ పురం ప్రాజెక్టు అధికారిగా బదిలీపై వెళ్లిన ఎం.సూర్యతేజకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వృద్ధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పిల్లల కేసుల్లో సూర్యతేజ తీసుకున్న నిర్ణయాలు ఆదర్శనీయమన్నారు. పీఓగా సూర్యతేజ మరింత సమర్థవంతంగా పనిచేయగలరని కలెక్టర్ ప్రశంసించారు. అనంతరం సూర్యతేజ దంపతులను ఘనంగా సత్కరించారు. జేసీ రామసుంద రెడ్డి, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, డీఆర్వో దాసి రాజు, డీఎస్పీ రామ మనోహరాచారి, తహసీల్దార్ ఫాజిల్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. రెడ్డప్పధవేజీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

పక్కాగా ఓటర్ల సవరణ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి డోర్ టు డోర్ సర్వే వేగవంతంగా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఓటర్ల జాబితా సవరణ, డోర్ టు డోర్ పరిశీలనపై వీఆర్వోలు, తహసీల్దార్లు, బీఎల్‌ఓలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా పరిశీలనకు తప్పనిసరిగా బీఎల్‌ఓలు, బీఎల్ఏలను వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఫారం 6,7,8పై పూర్తి అవగాహన కల్గి ఉండాలని, ప్రతిదానికి తప్పనిసరిగా డాక్యుమెంట్‌ను దగ్గర పెట్టుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పక్కాగా పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌లో 10 ఓట్లు ఉంటే మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. కేంద్ర ఎన్నికల అధికారులు జిల్లాలో ఎక్కడైనా పర్యటించవచ్చని, తప్పులు లేకుండా జాబితాలు తయారు చేయాలన్నారు. ఆర్డీఓ దాసి రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

13న ఎస్‌ఆర్‌కేఆర్‌లో ఫెన్సింగ్ పోటీలు



భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో ఫెన్సింగ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 13న 9వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ అండర్-20 బాయ్స్ అండ్ గరల్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణ మోహన్ చెప్పారు. శుక్రవారం ఫెన్సింగ్ పోటీల పోస్టర్‌ను కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు సాగి సత్యప్రతీక్‌వర్మ ఆవిష్కరించిన సందర్భంగా వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 314 మంది క్రీడాకారులు పోటీలకు హాజరవుతున్నారన్నారు. పోటీల ప్రారంభోత్సవంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ బి.శ్రీకాంత్, ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని చెప్పారు.

6 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



చింతలపూడి: చింతలపూడి మండలం పోతునూరు గ్రామంలో రైస్ మిల్లుపై రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో వ్యాన్‌లో తరలించడానికి సిద్ధంగా ఉన్న 6 టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ డీటీ జరీనా తెలిపారు. పట్టుబడ్డ బియ్యం నిల్వలకు సరైన బిల్లులు చూపనందున బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేశామని.. వ్యాన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

సాక్షి, భీమవరం: పట్టణంలోని నాచువారిసెంటర్‌లోని పసుపులేటివారి వీధిలో శుక్రవారం యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. చింతా ఏసు(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ తల్లితో కలసి జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం హైదరాబాద్ వెళ్లిన ఏసు తిరిగి భీమవరం వచ్చి మద్యం మత్తులో ఇంటివద్దే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తల్లి నాగమణి పనికి వెళ్తూ గదిలో చూడగా ఏసు నిద్రపోతున్నాడు. 11 గంటల ప్రాంతంలో నాగమణి ఇంటికి వచ్చి చూడగా తల్లి చీరతో ఉరి వేసుకుని కన్పించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ సీఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులస వేటలో.. కాసుల పంట

- నరసాపురం తీరంలో ముమ్మరంగా వేట
- భారీ వరదలతో అంతంతమాత్రంగానే లభ్యత



పులసల వేటలో భాగంగా గోదావరిలో వలలు కదుపుతున్న మత్స్యకారులు



పులసలు



పులస పులుసు

నరసాపురం : వర్షాకాలంలో ఆగస్టు నెల వచ్చిందంటే చాలు గోదావరిలో పులసలు సందడి చేస్తుంటాయి. మత్స్యకారులు సంప్రదాయ పడవల్లో వాటి వేటలో బిజీగా ఉంటారు. అయితే ఈ ఏడాది గోదావరిలో పులసల జాడ ఆగస్టు నెల వచ్చినా కానరావడం లేదు. ప్రస్తుతం వరదల ఉధృతి తగ్గడంతో చేపల వేట సాగుతోంది. గోదావరిలో కేవలం ఎర్రనీరు ఉన్నప్పుడు మాత్రమే లభ్యమయ్యే పులసల కోసం మత్స్యకారులు వేటను ముమ్మరం చేశారు. కొన్ని రోజులుగా అటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది నుంచి ఇటు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి సిద్ధాంతం వరకూ గోదావరిలో పులసలు పట్టడం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. పులసలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ ఉంది.

పుస్తెలమ్మయినా పులస తినాలనే నానుడి గోదావరి జిల్లాలో ఎప్పటి నుంచో ఉంది. ఎంత ధరైనా కొని తినాలని ఆరాటపడుతుంటారు. అంత డిమాండ్ ఉన్నందుకే వీటి ధరలు కూడా అంతే స్థాయిలో ఉంటాయి. పులసల సీజన్‌లో ఈ ప్రాంతం వారు వాటిని కొనుగోలు చేసి హైదరాబాద్, విశాఖపట్నం లాంటి దూర ప్రాంతాల్లోవున్న బంధువులు, స్నేహితులకు పంపుతుంటారు. పలువురు ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా పులస రుచి చూసి ప్రశంసించారు. సముద్రంలో ఇలసగా పిలిచే చేప గోదావరిలోకి ఎర్రనీరు రాగానే ఈదుకుంటూ వస్తాయి. సముద్రంలో వందల మైళ్లు ప్రయాణించి.. ఎర్రనీటికి ఎదురు ప్రవహించి రావడం వీటి ప్రత్యేకత. గోదావరిలోకి రాగానే వీటి శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. దానిలో ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు శాతం పెరగడంతో మంచి రుచి వస్తుంది. నీటికి ఎదురు ప్రవహించే క్రమంలో రెండు మూడు రోజుల్లోనే ఇలస.. పులసగా మారుతుంది. మారిన ఇలస రుచి మంచి వాసనతో నోరూరిస్తుంది. పులస, ఇలస ఒకేలా ఉండడంతో వీటిని గుర్తించడం కొంచెం కష్టం. గోదావరిలో ఎర్రనీరు ఎప్పటి వరకూ ఉంటుందో అప్పటి వరకూ దొరికేవి మాత్రమే పులసలని, మిగతావన్నీ ఇలసలుగా భావించాలని చెబుతారు.

పులసలు దొరికేది ఇక్కడే..

ప్రధానంగా నరసాపురం, సిద్ధాంతం, అంతర్వేది ప్రాంతాల్లో పులసలు ఎక్కువగా దొరుకుతాయి. ఈ ప్రాంతంలోనే పెద్ద సంఖ్యలో మత్స్యకారుల వలలకు చిక్కుతాయి. ఇటు సిద్ధాంతం వరకూ అలాగే తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు, గన్నవరం ప్రాంతాల వరకూ పులసల వేట ముమ్మరంగా సాగుతుంది. నరసాపురం, అంతర్వేది మార్కెట్లోనూ రావులపాలెం, సిద్ధాంతం, చించినాడ వంతెనల వద్ద పులసల అమ్మకాలు సాగుతాయి.

రంగపాల వలలకే పులస చిక్కేది

సముద్రంలో వేట సాగించే పెద్ద బోట్ల కంటే చెక్కనావల్లోని వలలకే పులసలు చిక్కుతాయి. పులసల వేట కోసం చెక్కనావలపై మత్స్యకారులు ప్రత్యేక వలలను ఉంచుతారు. వీటిని 'రంగపాల' వలలుగా పిలుస్తారు. ఓ వంద వరకూ చెక్కనావల ద్వారా వేట సాగిస్తే ఓ పదిహేను, ఇరవై పడవలకు మాత్రమే పులసలు పడతాయని మత్స్యకారుడు రేవు అప్పారావు చెప్పారు. పెద్ద బోట్ల వలలకు పరిమిత సంఖ్యలోనే పులసలు లభిస్తాయి. పులసలు తెల్లవారుజాము ప్రాంతంలో ఎక్కువగా పడతాయి. దీంతో మత్స్యకారులు అర్ధరాత్రి నుంచి వేట సాగిస్తారు.

వేల నుంచి రూ. లక్షల్లో ధర

పులసలు అరకిలో నుంచి రెండు కిలోల వరకూ బరువుంటాయి. సైజును బట్టి వీటి ధర లక్షల వరకూ వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. నగరాల్లో పులసలకు డిమాండ్ ఉన్నా ఎగుమతులకు ఆస్కారం లేదు. తక్కువ సంఖ్యలో పులసలు దొరకడమే అందుకు కారణం.

అర్ధరాత్రి వేటకు వెళ్తాం



ఈ సీజన్‌లో పులసలు పడతాయి. ఒక్క పులస దొరికినా మాకు రెండు, మూడు నెలలకు సరిపడా డబ్బులు వస్తాయి. మా చెక్క బోట్లకే పులసలు ఎక్కువగా పడతాయి. అందుకే అర్ధరాత్రి గోదావరిలోకి వెళ్లి ఉదయం వరకూ వేటాడతాం.

– మోకా సత్యనారాయణ, మత్స్యకారుడు

రంగపాల వలలకే చిక్కుతాయి



మా పెద్ద బోటు వలలకు పులసలు పెద్దగా పడవు. చిన్నగా వుండే రంగపాల వలలకే పులసలు చిక్కుతాయి. ఎర్రనీటిలో దొరికేవి మాత్రమే పులసలు. ఇతర రాష్ట్రాల నుంచి పులసలను పోలిఉండే చేపలు పట్టుకొచ్చి అమ్మేస్తున్నారు.

– తిరుమాని గంగయ్య, మత్స్యకారుడు

త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు



మాట్లాడుతున్న టెలికం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను

ఏలూరు (టూటౌన్): బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు త్వరలో 4జీ సేవలు అందించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెలికం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) భాగస్వామ్యంతో 4జీ సేవలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా తమ సంస్థకు లక్ష టవర్లు ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమలో 643 టవర్లు అందుబాటులో ఉన్నాయని కొత్తగా 4జీ సేవల ప్రారంభం కానుండటంతో మరో 75 టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వీటిలో ఏజెన్సీ ప్రాంతాలైన జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, టి.నర్సాపురం ప్రాంతాల్లో 52 టవర్లు ఏర్పాటు చేయనుండగా అర్బన్ ప్రాంతాల్లో సిగ్నల్స్ తక్కువగా ఉన్న చోట్ల మరో 23 టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇతర సర్వీస్‌లతో పోల్చితే అతి తక్కువ ధరలకే బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2జీ/3జీ సిమ్‌లు కలిగిన వారు 1.04 లక్షల మంది వరకూ ఉన్నారని.. వీరంతా సెప్టెంబర్ 30 లోగా ఉచితంగా 4జీలోకి మారే అవకాశం ఉందన్నారు. గతంలో పేపర్ అప్లికేషన్స్ ద్వారా సిమ్‌లు పొందిన వారిలో ఇంకా 66 వేల మందికి పైగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాలను ప్రభుత్వ సంస్థలు, వ్యాపార సంస్థలకు అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కెఎస్‌వీజీ సోమయాజులు, అకౌంట్ మేనేజర్ కె.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి



ప్రమాద ఘటన స్థలంలో మృతదేహాలు పరిశీలిస్తున్న సీఐ రాజేష్





మృతులు జాన్, నాగరాజు (ఫైల్ ఫొటోలు)

జంగారెడ్డిగూడెం రూరల్: రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి శివారులో ఇద్దరు మృతిచెందారు. జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. టి.నరసాపురం మండలం అప్పరాజుగూడెంకు చెందిన తానింకి జాను(40), మధ్యాహ్నపువారిగూడెంకు చెందిన కోమవరపు నాగరాజు (37) చెట్లు నరికి వాటిని విక్రయించే వ్యాపారం చేస్తుంటారు. గురువారం రాత్రి జంగారెడ్డిగూడెంలో కలప విక్రయించిన వ్యక్తి నుంచి సొమ్ము రావాల్సి ఉండడంతో పట్టణానికి వచ్చారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో తిరిగి ఇంటికి వెళుతుండగా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి శివారులో ద్విచక్ర వాహనం ఆగిపోవడంతో రోడ్డు పక్కగా ఆపి మరమ్మతులు చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిద్దరిని ఢీకొట్టింది. గుర్తుతెలియని వాహనం మీద నుంచి వెళ్ళిపోవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. జానుకు ఇద్దరు కుమారులు, నాగరాజుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న జాను, నాగరాజులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

యనమదుర్రులో శవమై తేలిన చిన్నారి

రెండ్రోజుల నుంచి కనిపించకుండా పోయిన కల్యాణ్



బాలుడి తల్లిని పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్



బాలుడు కల్యాణ్(ఫైల్)

పెంటపాడు: పెంటపాడు మండలం మీనవిల్లూరులో రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయిన బాలుడు పోకల వెంకట కల్యాణ్(6) యనమదుర్రు డ్రెయిన్‌లో కోమర్రు వద్ద శవమై తేలాడు. బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి స్కూలుకు వెళ్లిన కల్యాణ్ కనిపించక పోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఈ విషయంపై పెంటపాడు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.గ్రామానికి చెందిన పోకల సత్యనారాయణకు బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెంకు చెందిన శిరీషతో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. పెద్దల సమక్షంలో రాజీ చేసుకునేందుకు ప్రయత్నించినా సఖ్యత కుదరలేదు. మరోసారి పెద్దలతో కూర్చుని మాట్లాడుకుందామనుకున్నారు. ఈ లోగా ఈనెల 9న ఉదయం స్కూలుకు వెళ్తున్న బాలుడు అదృశ్యమయ్యాడు. పలు చోట్ల గాలించిన బాలుడు కానరాకపోవడంతో గురువారం సాయంత్రం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలుడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులతో పాటు, గ్రామస్తులు రెండు రోజుల నుంచి వెదకగా శుక్రవారం ఉదయం యనమదుర్రు ములసమ్మ తల్లి గుడి వద్ద శవమై కనిపించాడు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ శరత్‌రాజ్ పరిశీలించారు. మీనవిల్లూరు గ్రామంలో ఉన్న బాలుడి తల్లి శిరీషతో మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మామ, భర్తే కారణం

శిరీష మాట్లాడుతూ తన కుమారుడి మృతికి తన మామతో పాటు, భర్తే కారణమని వాపోయింది. వారిని కఠినంగా శిక్షించాలని ఎస్పీ రవిప్రకాష్‌ను వేడుకొంది. కొడుకు మృతదేహం చూసి ఆమె కన్నీరుమున్నీరైంది. కల్యాణ్‌ను బాలుడి తాత నాగేశ్వరరావు తనతోపాటు తీసుకెళ్లినట్లు పలువురు స్థానికులు తెలిపారు. ఆస్తి వెళ్లిపోతుందనే అక్కసుతో బాలుడిని తాత నాగేశ్వరరావే హత్య చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు జీవితమంతా కుట్రలు, కుతంత్రాలే

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు



తణుకు టౌన్: టీడీపీ అధినేత జీవితమంతా కుట్రలు, కుతంత్రాలేనని, తన అధికార దాహంతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. శుక్రవారం ఆయన తణుకు రూరల్ మండలం వేల్పూరులో మాట్లాడుతూ చంద్రబాబుది మొదటి నుంచి రక్త చరిత్రేనని, పదవిలోకి రావడానికి ఎంతటి ఘాతుకానికైనా పాల్పడతారని చెప్పారు. అలాంటి చంద్రబాబుకు కొన్ని పత్రికలు నిస్సిగ్గుగా మద్దతిస్తూ పాత్రికేయ విలువలకు పాతరేశాయన్నారు. వారాహి పేరుతో పవన్ కల్యాణ్ తన ఎజెండా చెప్పకుండా, నేను అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నాయకులను రోడ్డు మీద కొట్టేస్తానని అనడమే తప్ప సరిగా మాట్లాడటం రాలేదన్నారు. టీడీపీకి ఓట్లేయడానికే జన సైనికులందరూ యాత్రలు చేస్తున్నారన్నారు. పవన్‌కు ముఖ్యమంత్రి కావడం ముఖ్యం కాదని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి ప్యాకేజీ తీసుకోవడమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సీ.బాలకృష్ణ, జేఏసీ సభ్యుడు మధు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజు చొరవతో బస్‌షెల్టర్ల నిర్మాణం



మార్టేరు సెంటర్‌లో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్

పెనుమంట్ర: మార్టేరు సెంటర్ నుంచి ప్రయాణం చేయాలంటే గతంలో ప్రయాణికులు ఎండకు ఎండి, వానకు తడవాల్సి వచ్చేది. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో ఆ సమస్యకు మోక్షం కలుగనుంది. ఇక్కడ ఆచంట రోడ్డులో గ్రామ పంచాయతీ నిధులతో ప్రయాణికులకు సులభ్ కాంప్లెక్స్, బస్‌షెల్టరు నిర్మించగా, పాలకొల్లు రోడ్డులో ఒకటి, పెనుగొండ రోడ్డులో ఒకటి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో బస్‌షెల్టరు నిర్మించారు. పక్కనే మరో బస్‌షెల్టరు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం తీవ్రంగా ఎండకాస్తూ.. ఒక్కసారిగా భారీ వర్షం పడటంతో నాలుగు బస్‌షెల్టర్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కొద్దిరోజులలో నాలుగు బస్‌స్టేషన్‌లు ప్రారంభిస్తారని జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు



పూళ్ల వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు, తీవ్రంగా గాయపడిన బాధితుడు

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల వద్ద ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళానికి చెందిన ఎం.సాహిత్యకు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో 585 మార్కులు రావడంతో నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఆమెను శుక్రవారం చేర్పించాల్సి ఉండడంతో గురువారం రాత్రి కారులో సాహిత్య తండ్రి నాగభూషణరావు, మేనమామ రమణలు బయలుదేరారు. కారు డ్రైవర్ సంతోష్ అతివేగంగా నడుపుతూ నిద్రమత్తులో పూళ్ల రహదారిపై అప్పటికే ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు లారీకి కిందకు దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న భీమడోలు, ఉంగుటూరు 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాళ్లు కట్టి కారును లాగి కారులో ఇరుక్కున్న డ్రైవర్ సంతోష్‌తో పాటు మరో ముగ్గురిని ప్రాణాలతో కాపాడారు. ప్రమాదంలో కారు డ్రైవర్ సంతోష్, విద్యార్థి తండ్రి నాగభూషణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. మేనమామ రమణ, సాహిత్యలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారిని మేనమావ నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలకు తీసుకుని వెళ్లారు. భీమడోలు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరసాపురం రూరల్: నరసాపురం నుంచి మొగల్తూరు వెళ్లే జాతీయ రహదారిపై రుస్తుంబాద లెప్రసీ కాలనీకి సమీపంలో రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురంలో ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న తన చెల్లెలు హేమజ్యోతిని శుక్రవారం సాయంత్రం బైక్‌పై రుస్తుంబాద గాదివారి తోటకు చెందిన దేవరపు సాయిదుర్గా నాగేంద్రవర్మ (18) ఇంటికి తీసుకు వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా బొలెరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ వస్తున్న మరో యువకుడు వేగంగా నాగేంద్రవర్మ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో నాగేంద్రవర్మ అక్కడికక్కడే మృతిచెందగా.. అతని చెల్లెలు కుడికాలికి గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఎదురుగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టిన యువకుడికి కూడా గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై సుధాకరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఏలూరులో 3కే రన్

ఏలూరు రూరల్: ఈ నెల 13న ఆదివారం ఏలూరులో 3కే రన్ నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి జి.ఆదిత్యవర్మ, వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈ నెల 16 నుంచి 27 వరకూ విజయవాడ, కడపలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నందున ప్రజల్లో ఆసక్తి పెంచేందుకు 3కే రన్ చేపట్టామని వివరించారు. ఉదయం 8 గంటలకు స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకూ రన్ జరుగుతుందని వెల్లడించారు.

స్కూల్ బస్‌కు తప్పిన ప్రమాదం

సాక్షి, భీమవరం: విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేటు స్కూల్ బస్సు విద్యుత్ స్తంభాన్ని తాకుతూ వెళ్లగా విద్యుత్ తీగలనుంచి మంటలు రావడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వన్‌టౌన్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్ మరో వాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కకురావడంతో విద్యుత్ స్తంభాన్ని రాసుకుంటు వెళ్లిందని దీంతో విద్యుత్ తీగల నుంచి మంటలు వచ్చాయని స్థానికులు తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

బలుసులమ్మకు విశేష పూజలు



బలుసులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని విశేష అలంకరణ గావించారు. దాతలు చామన సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులు, గట్టి సురేష్, త్రిలోక సుందరి, నిడదవోలు విజయకుమార్, వరలక్ష్మిలు సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొట్టు అంజిబాబు, వెలనాటి సత్తిబాబులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ స్థాయిలో శుక్రవారం జువ్వలపాలెం ఈఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర జేఏసీ నాయకులు తెలిపిన పీఆర్‌సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీని ఒప్పుకున్న జేఏసీ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, సాయి కృష్ణలు ఇద్దరు రాజీనామా చేయాలన్నారు. నిరసనలో విద్యుత్ సంఘాల ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుంటూరు మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న లాయర్స్ యూనియన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ఏపీ రాష్ట్ర మహాసభలు ఈ నెల 12, 13 తేదీల్లో గుంటూరులో శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు ఏఐఎల్‌యూ జిల్లా కమిటీ కోశాధికారి పి.వేణుగోపాల చౌదరి తెలిపారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి, ఏఐఎల్‌యూ జిల్లా సభ్యులు ఎం.రామారావు, ఎస్‌ఎన్‌టీ బాబా, వై.మణికంఠ తేజ, డి.కృష్ణ, చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం చర్చిలో కళ్లజోళ్ల పంపిణీ



వైద్యశిబిరంలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న సంస్థ అధినేత జైబాబు

పెంటపాడు: గూడెం బాగ్యలక్ష్మి పేట ఎల్ఎల్ఎం చర్చిలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన శ్రీరామ్ ఐ కేర్ ఆసుపత్రి డాక్టర్లు వి. అశోక్ కుమార్, పి. సౌమ్య తదితరులు కంటి రెటీనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కళ్లజోళ్లు రాయితీపై అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, ఎల్ఎల్ఎం హెల్పింగ్ టీం సభ్యులు శాంతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాల మృతవీరుల సంస్మరణ సభ



మృతవీరుల సంస్మరణలో సభలో పాల్గొన్న చీకటిమిల్లి మంగరాజు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాల మృతవీరుల సంస్మరణ సభ శుక్రవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో మసీద్ పేట అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంస్మరణ సభలో నాయకులు డి.బాబీ పాల్గొన్నారు.

త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకోవాలి



తణుకు టౌన్: ముద్దాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



తాడేపల్లిగూడెం(టీఓసీ):మొక్కలు నాటుతున్న వార్డు ఇంచార్జ్ అడ్డాల నరసింహారావు తదితరులు

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు అర్బన్: దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో భారతీయులంతా మెలగాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా వసుధకు వందనంలో శుక్రవారం స్థానిక బ్యాంక్ కాలనీలోని పార్కు ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితమే భారత దేశ స్వాతంత్ర్య ఫలం అన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ మానవాళి పదికాలాలు జీవించాలంటే మొక్కల ప్రాముఖ్యత చాలా ఎక్కువ అన్నారు. పర్యావరణం కాలుష్యబారిన పడుతున్న నేపథ్యంలో మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరూ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పార్కుతో పాటు బ్యాంక్ కాలనీ ప్రాంతంలో రహదారి పొడవునా మొక్కలు నాటారు. మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన



తణుకుఅర్బన్: బ్యాంక్ కాలనీ పార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, తమ్మయ్య

సూర్య, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పుల్లెపు సూరిబాబు, కుడుపూడి చంద్రరావు, రేలంగి రాంబాబు, షేక్ బాజీ, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా 'నా మట్టి- నా దేశం'

తణుకు టౌన్: నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా తణుకు మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో వసుధకు వందనం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉత్సహంగా నిర్వహించారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చుండ్రు శ్యామల, తదతరులు పాల్గొన్నారు. మండలంలోని మండపాక, తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాల, కౌమరవరం తదితర సచివాలయాల పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొని మొక్కలు నాటారు. ముద్దాపురంలో శిలాఫలకం వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 'నా మట్టి- నాదేశం' కార్యక్రమంలో శుక్రవారం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వసుధకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యాలక్ష్మీసుందరి బాయి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జి రమ్య, సీహెచ్ రమేష్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించేందుకు కృషి చేద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు నా మట్టి-నా దేశం నేల తల్లికి నమస్కారం కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక 10వ వార్డులో అడ్డాల నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, చామన ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వై.వి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధుల పట్ల అశ్రద్ధ వద్దని, ప్రతి ఒక్కరు ఆరోగ్య నియమాలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్, కడకట్ల పరిధిలోని 8, 31, 32 వార్డుల్లో శుక్రవారం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలు జరిగాయి. వార్డుల్లో ర్యాలీలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిశీలన, సీజనల్ వ్యాధులపై అవగాహన చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతీ ఒక్కరూ ఆరోగ్యపరంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలు వ్యాప్తి ద్వారానే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. వ్యాధులు వస్తే వైద్యుల సూచనలు మేరకు తగిన మందులు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ ర్యాలీలో ఆరోగ్య సహాయకులు కాంతారావు, కార్యకర్తలు వెంకటలక్ష్మి, కళ, చినపాప, లక్ష్మి, ఆశాలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే విధంగా సేవా కార్యక్రమాలు రూపకల్పన చేయాలని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ నూతన సభ్యులకు ప్రోత్సాహం అందించాలని, క్లబ్ పనితీరు బాగుందని చెప్పారు. మొక్కలను పెంచి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. రీజియన్ ఛైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్, జోన్ ఛైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజులు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో



లయన్స్‌క్లబ్ డైరీలను ఆవిష్కరిస్తున్న జిల్లా గవర్నర్ మాణిక్యాలరావు

పూతినీడి శివరామకృష్ణ, జొన్నల సతీష్‌కుమార్, కుందుం వెంకటేశ్వరరావు, తిలక్, ఎల్.మధుబాబు, యర్రా ఆంజనేయస్వామి, ఎం.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఖర్చులు ఆదా

తాడేపల్లిగూడెం రూరల్: ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఖర్చులను ఆదా చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం తాడేపల్లిగూడెం జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో సీడ్ టు సీడ్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పాటు ఇంటి వద్దనే కూరగాయలు పండించుకుని ఆరోగ్యవంతమైన జీవితాలను గడపాలని ఆకాంక్షించారు. భూసారం పెరగడానికి రైతులు తమ చేలలో నవధాన్యాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ యాచవరపు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు పోలిమోను శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులు ఆర్బీకేలను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ఆర్బీకేలను వినియోగించుకుని, ఎరువులు, పురుగు మందులు పొందాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు) అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దబ్బులు ఎరువులు, పురుగు మందులు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపారు. అనంతరం వ్యవసాయ యంత్ర పరికరాలను వ్యక్తిగతంగా అందించాలని, జింక్, బోరాన్ వంటి ఎరువులను 50 శాతం సబ్సిడీపై అందించాలని, ఆయిల్‌పామ్ మొక్కలను సబ్సిడీపై అందించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, మండల ఉద్యాన శాఖఅధికారి శ్రీలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కేతిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి

విద్యాభివృద్ధికి దాతల సేవలు అభినందనీయం

పెంటపాడు: గ్రామంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులు, స్కూల్ అభివృద్ధికి పాటు పడిన దాతలు అభినందనీయులని ఎంఈవో ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. మీనవిల్లూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు -నేడు తో పాటు, ప్రత్యేకంగా స్కూల్ ఆర్చి నిర్మాణానికి నిధులు అందించిన కోటేశ్వరరావు, నెక్కంటి రవీంద్ర, హెచ్‌ఎం వెంకటేశ్వర్లను శుక్రవారం ఎంఈవో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ నిల్లా నాగమల్లయ్య, సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు దేవికారాణి, పార్టీ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పాతూరి సత్యనారాయణ మూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, దాతలను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జీవరాశి ప్రకృతితో ముడిపడి ఉందని, ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు, 13వ వార్డు ఇంచార్జి తెన్నేటి జగజ్జీవన్ అన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్ద శివాలయం వద్ద నుంచి వార్డులో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో టీపీఓ హరిప్రసాద్, వార్డు కన్వీనర్లు ధర్నాల శేఖర్, ఎర్రంశెట్టి కృష్ణవేణి, సచివాలయం కార్యదర్శులు ప్రసాద్, రాజ్‌కుమార్, రూపదేవి, శారదా, నాగబాబు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న తెన్నేటి జగజ్జీవన్, సచివాలయం సిబ్బంది తదితరులు

విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలి

తణుకు అర్బన్: బాలలు, మహిళల హక్కులకు భంగం వాటిల్లితే రాష్ట్ర కమిషన్ దృష్టికి తీసుకురావాలని న్యాయం చేసే దిశగా కమిషన్ కృషి చేస్తుందని బాలల హక్కుల కమిషన్ మెంబరు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మెంబరు బి.వినీత అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులంతా మంచి ప్రవర్తనతో ముందుకు నడవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

నా మట్టి-నా దేశంలో శిలాఫలకాల ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మాధవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ భూసారం పెంపుదల, సహజ వనరులు వినియోగం తదితర విషయాలపై అవగాహన చేశారు. ఒత్తిడి లేని వ్యవసాయం ద్వారా ఆహార స్వయం సమృద్ధిని సాధించడానికి రైతులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.రాఘవేంద్రరెడ్డి, సర్పంచ్ సూర్యకుమారి, ముప్పిడి వెంకట రామిరెడ్డి, ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం: మొక్కల నాటుతున్న ఉపకులపతి టి.జానకిరామ్

పండుగలా నాభూమి-నాదేశం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. ఆయా వార్డులోని వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో 20వవార్డు ఇన్‌చార్జి రాజా త్రినాథ్, 34వవార్డు ఇన్‌చార్జ్ వట్టి బుజ్జి, 14వవార్డు ఇన్‌చార్జి నీరుకొండ పండు, మున్సిపల్ సిబ్బంది ఎఎస్‌ఓ సురేషు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: 34వార్డులో మొక్కలు నాటుతున్నవార్డు ఇన్‌చార్జి వట్టి బుజ్జి తదితరులు



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం గ్రామంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ చంద్రిక

భావితరాల మనుగడకు మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం రూరల్: భావితరాలు ఆరోగ్యవంతంగా మనుగడ సాగించడానికి మొక్కలు నాటాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. మన భూమి - మన దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని జగన్నాథపురం -2 సచివాలయ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. తమ పరిసరాల్లో మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలన్నారు. యువత దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ పోసిన శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఇరగవరం: నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగాగం శుక్రవారం ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో స్కూల్, పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించారు. రేలంగి సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం మాట్లాడుతూ పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అలివేలు మంగతాయారు, ఎపిడి బి వీరా స్వామి, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, నాయకలు పులుపు అనిల్, చేబ్రోలు పెద్దిరాజు, వడ్డే మార్కేండేయులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌టీఎఫ్ విద్యాసదస్సు

తణుకు అర్బన్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం తణుకు మునిసిపల్ కార్యాలయ ప్రాంతంలోని మునిసిపల్ యూపీ స్కూల్‌లో విద్యాసదస్సు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురాల సుధాకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గం నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వివరించారు.

ఆదినారాయణరాజు సేవలు మరువలేనివి

అత్తిలి: ప్రముఖ పారిశ్రామిక వేత్త, న్యాయవాది మంతెన ఆదినారాయణరాజు ఆకస్మిక మృతి పట్ల కంచుమర్రు గ్రామ ప్రజలు పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స వెంకటపతిరాజు మాట్లాడుతూ కంచుమర్రు, ఈడూరు గ్రామాలకు ఆదినారాయణరాజు అనేక సేవలు అందించారన్నారు. గ్రామంలో ఆసుపత్రిని స్థాపించడంతో పాటు పాఠశాలలో రూ.2 లక్షల వ్యయంతో బెంచీలు ఏర్పాటు చేశారన్నారు. రామాలయం నిర్మాణాన్ని ప్రోత్సహించారని, వాటర్‌ప్లాంట్ , ఆలయాల నిర్మాణానికి సహాయసహకారాలు అందించారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ములగపాటి సూరి, సర్పంచ్ వెంకటకృష్ణంరాజు, మాజీ సర్పంచ్ తేలి సుందరరావు, కార్యదర్శి భాస్కర్, వీఆర్వో రత్నాకర్, వార్డు సభ్యులు శేఖర్, మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఆదినారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఇరగవరం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ సలహాదారులు, ఏపీ ఎన్ఆర్‌టి అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెంకట్ ఎస్ మేడపాటి తండ్రీ మేడపాటి సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ. 16 లక్షలు విరాళంతో నిర్మించిన సైకిల్ షెడ్, క్రీడా ప్రాంగణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో సముల మార్పులు తీసుకోచ్చి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారు. విద్యార్థులు ప్రభుత్వ సదుపాయలుతో పాటు దాతలు అందిస్తున్నా సహకారాన్ని వినియోగించుకొని బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడాల లక్ష్మీ, ఎంపీటీసీ కోవ్వూరి విజయలక్ష్మి నాయకులు, పేరెంట్స్ కమిటి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనలో పోటీ పడాలి

భీమవరం (ప్రకాశంచౌక్): లక్ష్యాలు సాధించుటలో మండల అధికారులు పోటీ పడి పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో భూముల రీ సర్వే, అసైన్డ్ భూములు, సివిల్ సప్లై,, అడంగల్, సర్వే, ఇళ్ల స్థలాలు, భూసేకరణ, టూరిజం ప్రాజెక్టులు, స్పందన, మీసేవ, వాటరు టాక్స్ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాలు వారీగా అంశాల ప్రగతిని సమీక్షిస్తూ ప్రగతిలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులపై జేసీ అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ప్రగతిని చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలో స్పందన కార్యక్రమం అత్యంత బాధ్యతతో ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని ఈనెల 21వ తేదీలోగా నూటికి నూరు శాతం పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీఓ దాసిరాజు, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎస్.సరోజ, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురష్కరించుకొని పట్టణ న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా న్యాయవాదులకు చదరంగం, క్యారం బోర్డు ఆటలను ఆడించారు. రెండోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అన్నామణి పోటీలను ప్రారంభించారు.